## ఘనంగా తిరు నక్షత్ర వేడుకలు


పూజల్లో పాల్గొన్న నాయకులు

**చాంద్రాయణగుట్ట:** చాంద్రాయణగుట్టలోని స్వయంభు చెన్నకేశవ స్వామి ఆలయంలో తిరు నక్షత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎ.మహేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి బోయ నగేష్, సీనియర్ నాయకులు డి.నర్సింగ్ గౌడ్, బి.వెంకటేష్ ముదిరాజ్, కొప్పుల ప్రవీణ్, మోహన్ రెడ్డి, ప్రమోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత నీటి సరఫరాను అరికట్టాలి

**గౌలిపురా:** గౌలిపురా డివిజన్‌లోని హనుమాన్‌నగర్ ఫేజ్-3లో గత వారం రోజులుగా కలుషిత తాగునీటి సరఫరాతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోజు విడిచి రోజు సరఫరా అయ్యే తాగునీటిలో అర గంట పాటు కలుషిత నీరు సరఫరా కావడంతో తాగడానికి నీరందక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రజలు కలుషిత నీటి కారణంగా అనారోగ్యానికి గురి కాకముందే తగిన చర్యలు తీసుకోవాలంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కలుషిత తాగునీటిని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## జలమండలి ఎండీతో ఎమ్మెల్యే సమావేశం

**యాకుత్‌పురా:** యాకుత్‌పురా నియోజకవర్గంలో చేపటాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ మంగళవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రతిపాదించిన తాగునీటి, డ్రైనేజీ సీవరేజీ పైప్‌లైన్ పనులను వెంటనే మంజూరు చేసి నిర్మాణ పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజ సమస్యల పరిష్కారానికి నూతన అభివృద్ధి పనులు చేపట్టానున్నామన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, నాలా, రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో రెయిన్‌బజార్, డబీర్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, అలందార్ వాలాజహి, జలమండలి ఆపరేషన్స్ డైరెక్టర్ వినోద్ భార్గవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రహదారి.. అధ్వానంగా మారి..

- గుంతలమయంగా గుడిమల్కాపూర్ రోడ్లు
- రోడ్ల పక్కనే కుప్పలుగా వ్యర్థాలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు


రోడ్ల పక్కనే వ్యర్థాలు


గుంతలమయంగా గుడిమల్కాపూర్ మార్కెట్ వెనుక రోడ్డు

**గోల్కొండ:** గుడిమల్కాపూర్ డివిజన్‌లోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. గుడిమల్కాపూర్ డివిజన్‌లో రాష్ట్రంలో అతిపెద్దదైన పూల హోల్‌సెల్ మార్కెట్‌తో పాటు కూరగాయల మార్కెట్ కూడా ఉంది. ఈ రెండే కాకుండా గుడిమల్కాపూర్ డివిజన్ వ్యాపార కేంద్రంగా కూడా ఉంది. అయితే అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా డివిజన్ పరిధిలో ఎన్నో సమస్యలు నెలకొని ఉన్నాయి. ప్రధానంగా అధ్వానంగా ఉన్న రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులతో పాటు డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల అంతర్గత రోడ్లు సైతం గుంతలమయంగా తయారయ్యాయి. గుడిమల్కాపూర్ వెజిటబుల్ మార్కెట్, సత్యనారాయణ కాలనీ, మెహిదీపట్నం-గుడిమల్కాపూర్ చౌరస్తా, గోల్డెన్ ప్యాలెస్ చౌరస్తా-కార్వాన్ రోడ్డు ఇలా ప్రధాన రహదారులన్నీ గోతులమయంగా తయారయ్యాయి. డివిజన్‌లో రోడ్ల మరమ్మతుకు అధికారులు చొరవ చూపడం లేదు. కనీసం అధికారులు స్థానికంగా పర్యటించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### ప్యాచ్‌వర్క్‌లలో నాణ్యత లేకపోవడంతో..

రోడ్లకు చేస్తున్న ప్యాచ్‌వర్క్‌లు నామ్‌కే వాస్తేగా ఉంటున్నాయి. గుడిమల్కాపూర్ వెజిటబుల్ మార్కెట్ మెయిన్ రోడ్డు, గోల్డెన్ ప్యాలెస్ చౌరస్తా, తాళ్లగడ్డ, శారదానగర్ తదితర ప్రాంతాల్లో వేసిన ప్యాచ్‌వర్క్‌లు నాణ్యత లేకపోవడంతో వాహనాల రాకపోకలకు రోడ్లు కంకరతేలి మళ్లీ గుంతులు ఏర్పాడ్డాయి. వరుసగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు బాగా దెబ్బ తిన్నాయి. ఇక్కడ కూడా అధికారులు తమ నిర్లక్ష్యాన్ని చాటుకున్నారు. లక్ష్మీనగర్ చౌరస్తా-గుడిమల్కాపూర్ రోడ్డు అత్యంత రద్దీగా ఉండే రోడ్డు. నగర శివారు ప్రాంతాల నుంచి కూరగాయల మార్కెట్, పూల మార్కెట్‌కు ఈ మార్గం గుండానే రైతులు తమ పంటలను తేస్తారు. ఇంతటి ప్రధానమైన రోడ్డు అధ్వానంగా ఉంది. ప్రజా ప్రతినిధి లేకపోవడంతో అధికారుల నిర్లక్ష్యం పెరిగిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. బల్దియా, జలమండలి అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

### ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..



గత సంవత్సర కాలంగా గుడిమల్కాపూర్ డివిజన్‌లోని రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. అత్యంత రద్దీగా ఉండే సత్యనారాయణ రోడ్డు, గుడిమల్కాపూర్ మెయిన్ రోడ్డు పూర్తిగా గుంతలతో మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గుడిమల్కాపూర్ కార్పొరేటర్ మృతితో ఈ డివిజన్‌కు ప్రజాప్రతినిధి లేకుండా పోయారు. కార్పొరేటర్ లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.
– జొన్నకుంటి మధుసూదన్, కార్వాన్

## గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం చేయాలి


టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి యత్నించిన తెలంగాణ జాగృతి ప్రతినిధులు

**గన్‌ఫౌండ్రీ:** గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం చేయాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జాబ్ క్యాలండర్‌ను ప్రకటించాలని కోరుతూ మంగళవారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అనేక లోపాలతో గ్రూప్-1 పరీక్షలను నిర్వహించిందనే విషయాన్ని రాష్ట్ర హైకోర్టు ఎత్తిచూపిందని గుర్తుచేశారు. జీవో నెంబర్‌29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆందోదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంతానికి పోకుండా నిరుద్యోగులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. టీజీపీఎస్సీ కార్యాలయం లోపలికి జాగృతి నాయకులు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, జాగృతి నాయకులకు వాగ్వాదం చేటు చేసుకుంది. పరిస్థితి ఉధృతంగా మారుతుండడంతో జాగృతి నాయకులను అరెస్ట్ చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

## ఎమ్మెల్యే కౌసర్‌ను కలిసిన కేబుల్ ఆపరేటర్లు



**గోల్కొండ:** గోల్కొండ, టౌలిచౌకీ, నాలాల్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రైవేట్ కేబుల్ ఆపరేటర్లు మంగళవారం ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్‌ కలిశారు. ఈ సందర్భంగా వారు కేబుళ్ల కత్తిరింపు కారణంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..విద్యుత్ స్తంభాలకు ప్రైవేటు కేబుళ్లు ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కేబుళ్ల బరువుకు విద్యుత్ స్తంభాలు ఒక వైపు వంగిపోయి ప్రమాదకరంగా మారిపోయాయన్నారు. ప్రైవేటు కేబుల్ ఆపరేటర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆయనను కలిసిన వారిలో మహ్మద్ మజ్హర్, తౌఫిక్, రషీద్ తదితరులు ఉన్నారు.

## పెండింగ్ వేతనాలను చెల్లించాలని ధర్నా


కోఠి డీఎంహెచ్‌ఎస్‌లో ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

**సుల్తాన్‌బజార్:** వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఐదు నెలల పెండింగ్ వేతానలు చెల్లించాలని కోరుతూ తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కోఠిలోని డీఎంహెచ్‌ఎస్‌లో ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సంఘం గౌరవ అధ్యక్షుడు రాంబాబుయాదవ్ హాజరై ప్రసంగించారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు 5 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారికి వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాను అధికారంలోకి రావడానికి ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు డబ్బులు లేవనడం సరైనది కాదన్నారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి


సమావేశంలో బద్దం మహిపాల్‌రెడ్డి, నాయకులు

**గోల్కొండ:** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం గుడిమల్కాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో విమోచన దినోత్సవంపై జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని గెజిట్ విడుదల చేసి అధికారికంగా నిర్వహిస్తుందని..దీనిని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కచ్చితంగా పాటించాలన్నారు. పార్టీలకు అతీతంగా నేడు తెలంగాణ అంతటా విమోచన దినోత్సవాలు జరుగుతున్నాయన్నారు. నేడు జరిగే విముక్తి దినోత్సవ ఉత్సవాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి.అమర్ సింగ్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు టి.యోగ్‌రాజ్ సింగ్, బీజేపీ పార్లమెంటు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, నాయకులు వి.జగదీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి


నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

**చార్మినార్:** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ సిటీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ముందు నిరసన తెలిపారు. కళాశాల అధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ..ఏవైతే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ లు, మెస్ బకాయిలు రూ.8,500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయో వాటిని వెంటనే ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ విద్యార్థులపై వ్యవహరిస్తున్న తీరు సిగ్గు చేటు అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సాకేత్, దేవేందర్, శివ, ప్రశాంత్, మనీష్, ప్రణయ్, బన్నీ, నవనీత్, ఆనంద్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా మదన్‌లాల్

**యాకుపురా:** మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా మదన్‌లాల్‌ను నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ నయీముద్దీన్‌ను రెయిన్ బజార్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేసి ఆయన స్థానంలో రెయిన్‌బజార్ డీఐగా విధులు నిర్వహిస్తున్న మదన్‌లాల్‌ను మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. ఇరువురు ఇన్‌స్పెక్టర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ఉచిత వైద్య శిబిరం



**గోల్కొండ:** లాభాపేక్ష లేకుండా తాము ఆసుపత్రి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని నాలల్‌నగర్‌లోని ప్రీమియర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్ మర్దా అన్నారు. ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ వైద్య శిబిరంలో వివిధ రకాల రోగ నిర్ధారణ పరీక్షలతో పాటు మధుమేహం, బీపీ తదితర పరీక్షలను నిర్వహించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుమారు 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రోహిత్, డాక్టర్ శివరాజ్, దంత వైద్యురాలు డాక్టర్ ఆస్రా, మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాస్, ఆనంద్ తదితరులు ఉన్నారు.




## ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం నేటి తరానికి ఆదర్శం


ఆవుల మంజులతకు సుశీల సుబ్రహ్మణ్యం సారస్వత పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం

**నాంపల్లి:** ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం నేటి తరానికి ఆదర్శమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి అన్నారు. ధృవం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆచార్య జీవియస్ సాహితీ పురస్కార ప్రదానోత్సవం సభ మంగళవారం రాత్రి నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా సీఈఓ వెంకట్ చంగవల్లి అధ్యక్షతన జరిగిన సభలో ఆచార్య జి.వి.ఎస్ సాహితీ పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యంకు, సుశీల సుబ్రహ్మణ్యం సారస్వత పురస్కారాన్ని తెలుగు వర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య ఆవుల మంజులతకు ప్రదానం చేసి సత్కరించారు. ధృవం ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సౌమ్య వారణాసి శిష్య బృందం ప్రదర్శించిన సంగీత కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. మహా మహోపాధ్యాయ శలాక రఘునాథ శర్మ, సాహితీవేత్తలు డాక్టర్ ముక్తేవి భారతి, ఆచార్య టి.గౌరీశంకర్, ఆచార్య వై.రెడ్డి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## సేవామూర్తి రమాదేవి మృతి తీరని లోటు



**సాక్షి, సిటీబ్యూరో:** వృద్ధులు, మానసిక వికలాంగుల కోసం విశేష సేవలందించిన మానవీయ మహిళా సేవామూర్తి రమాదేవి మరణం తమకు తీరని లోటని అనురాగ్ హ్యూమన్ సర్వీసెస్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు 32 ఏళ్ల పాటు సామాజిక సేవారంగంలో అంకితభావంతో, సేవాతత్పరతతో ఆమె సేవలందించారని పేర్కొన్నారు. టోలిచౌకిలోని అనురాగ్ హ్యూమన్ సర్వీసెస్, సీనియర్ సిటిజన్ల గృహం, మానసిక వికలాంగుల శిక్షణ కేంద్రంలో రమాదేవి విశేష సేవలందించారని వారు గుర్తు చేసుకున్నారు. ఆమె జీవితకాలంలో సగం కన్నా ఎక్కువ జీవితం సేవలోనే గడిపారని కొనియాడారు. కాగా గురువారం అనురాగ్ హ్యూమన్ సర్వీసెస్ కార్యాలయంలో రమాదేవి సంస్మరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## అలరిస్తున్న కోహినూర్ థియేటర్ కార్నివాల్



**గన్‌ఫౌండ్రీ:** తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో క్రియేటివ్ థియేటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోహినూర్ థియేటర్ కార్నివాల్ ఆహుతులను ఆకట్టుకుంటుంది. మంగళవారం రవీంద్రభారతిలో పలు నాటకాలను, ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ప్రదర్శించారు. భరతముని నాట్య శాస్త్ర, సాలు మరగాల తాయి తిమ్మక్క అనే వైవిధ్య భరితమైన నాటక ప్రదర్శనలు సమ్మోహన పరిచాయి. ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని పలువురు వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో క్రియేటివ్ థియేటర్ సంస్థ వ్యవస్థాపకులు మంకెనపల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ధోబీఘాట్ అభివృద్ధికి రూ.21 లక్షలు మంజూరు

**చాంద్రాయణగుట్ట:** నల్లవాగు ధోబీఘాట్ అభివృద్ధికి జీహెచ్‌ఎంసీ రూ.21 లక్షలు మంజూరు చేయడంపై గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. సమస్యను విన్నవించిన వెంటనే నిధులు మంజూరు చేసిన జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని సన్మానించారు. శ్యాంరావు మాట్లాడుతూ..ధోబీఘాట్‌లో ఐరన్ జాలీ, గేట్, నిరీక్షణ గది నిర్మాణం కోసం ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ సందర్భంగా ఆయన జడ్‌సీతో పాటు ఈఈ సలావుద్దీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

## 'బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తా'

**నాంపల్లి:** అఫ్జల్‌సాగర్ నాలాలో గల్లంతైన కుటుంబాలను మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ..75 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో దళితుల దుర్భర జీవితాలకు మాన్గర్ బస్తీ నిదర్శనమన్నారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జి.శంకర్, కె.లక్ష్మీనారాయణ, డి.బి.ఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్‌తో పాటుగా పలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కత్తితో సంచరిస్తున్న యువకుడికి జైలు

**చాంద్రాయణగుట్ట:** చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో కత్తితో సంచరిస్తున్న యువకుడికి నాంపల్లి న్యాయస్థానం 15 రోజుల రిమాండ్ విధించింది. ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి తెలిపిన వివరాల ప్రకారం..షాహిన్‌నగర్‌కు చెందిన మహ్మద్ హాఫీజ్(24) నేరం చేయాలన్న ఉద్దేశంతో కత్తితో చాంద్రాయణగుట్టలో సంచరిస్తున్నాడు. అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకొని సోదాలు చేయడంతో కత్తి లభించింది. నాంపల్లి 9వ ప్రత్యేక మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి మంద మురళీ నిందితుడికి 15 రోజుల జైలు శిక్షను విధించారు.

## బాలిక అదృశ్యం


పూజ

**అబిడ్స్:** బాలిక అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..మంగళ్‌హాట్ ఆర్‌కేపేట్‌లో నివసించే పూజ(17) మంగళవారం ఉదయం 8గంటల సమయంలో కూరగాయలు తెస్తానని మార్కెట్‌కు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐఐఎఫ్ ప్రతినిధి బృందం మిధాని సందర్శన


మిధాని-ఐఐఎఫ్ ప్రతినిధి బృందం

**సంతోష్‌నగర్:** భారతీయ ఫౌండ్రీమెన్ ఇనిస్టిట్యూట్ (ఐఐఎఫ్) ప్రతినిధి బృందం పరస్పర సహకారం, సాంకేతిక భాగస్వామ్య అవకాశాలపై చర్చించేందుకు మంగళవారం భారత రక్షణ సంస్థకు చెందిన మిశ్రా ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని)ను సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని మిధాని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి.ఎస్.నారాయణ మూర్తి ప్రారంభించారు. అనంతరం ఐఐఎఫ్ అధ్యక్షుడు సుశీల్ కుమార్ శర్మ తన అభిప్రాయాలు తెలిపారు. మిధాని, ఐఐఎఫ్ నుంచి ప్రెజెంటేషన్లు, కార్పొరేట్ మీడియాల ద్వారా రెండు సంస్థల విజయాలు, సామర్థ్యాలు, భవిష్యత్ ప్రణాళికలను ప్రతినిధి బృందానికి వివరించారు. అనంతరం బహిరంగ చర్చలో మిధాని రక్షణ రంగ కాస్టింగ్ అవసరాలు, విక్రేత నామినేషన్ ప్రక్రియ, సాంకేతిక అప్‌గ్రేడ్ మద్దతు, ఐఐఎఫ్ సభ్యుల కోసం మిధాని సదుపాయాల వినియోగం, ముడి పదార్థాలపై కన్సల్టెన్సీ, రాబోయే ఐఎఫ్ఈఎక్స్-2026లో మిధాని పాల్గొనే అవకాశం వంటి అంశాలను చర్చించారు. ఐఐఎఫ్-మిధాని మధ్య ఒక అవగాహన ఒప్పందంపై కూడా చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిధాని ఫైనాన్స్ డైరెక్టర్ మధుబాల, అదనపు జనరల్ మేనేజర్ ఎస్.కె.జైన్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

**నాంపల్లి:** రైల్వే స్టేషన్లలో దొంగతనాలకు పాల్పడే ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు ల్యాప్‌టాప్‌లు, 26 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్(జీఆర్పీ)లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రైల్వే డీఎస్పీ జావేద్ నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ నెల 15న రాత్రి హైదరాబాద్ రైల్వే స్టేషన్లలో తచ్చాడుతూ కనిపించిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. కస్టడీలోకి తీసుకుని విచారించగా బేగంపేట, లింగంపల్లి రైల్వే స్టేషన్లలో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో వారిని అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరిలో ఏ-1 అదుంబర్ నిక్కమ్ కుమారుడు, కూలిపని చేసే ప్రశాంత్(31), ఏ-2 మాణిక్ కుమారుడు, చెఫ్ పని చేసే గోపాల్(34) కర్ణాటక రాష్ట్రం, గుల్బర్గా ప్రాంతానికి చెందిన వారుగా గుర్తించారు. వీరి నుంచి రూ.5 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.